# ఒక్క మనిషి చాలు

ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్‌గారు మైకు దగ్గరకు వెళ్లి, దాని మీద రెండు చిటికెలు వేశారు. మైకు పనిచేస్తున్నదని నిర్ధారణ చేసుకుంటూ, సారథి వేపు చూసి ఒకసారి చిరునవ్వు నవ్వేరు.

"సరిగ్గా ముప్పయి సంవత్సరాల క్రితం, నేను ఈ కాలేజీలోనే ఇంజనీరింగ్ పాసయాను. తర్వాత పై చదువులు చదవటం, కాలేజీలోనే లెక్చరర్‌గా చేరటం, అంచెలంచెలుగా పైకి రావటం వలన, ఈ రోజున మీ ముందు ప్రిన్స్‌పాల్‌గా నుంచుని మాట్లాడుతున్నాను. ఈరోజు ఫైనలియర్ విద్యార్థులనందరినీ ఆహ్వానించటం జరిగింది. దానికి కారణం - ముప్పయి సంవత్సరాల క్రితం నాతోపాటు ఇంజనీరింగ్ చదివిన సారథి - ఈయన అమెరికా వెళ్లి అక్కడే పిహెచ్‌డి చేసి, ఒక పెద్ద హైటెక్ కంపెనీలో సీనియర్ మానేజ్‌మెంటు పొజిషన్‌లో పనిచేసి, తిరిగి ఇండియా వచ్చేశారు. ఆయన ఇప్పుడు ఈ వూరు రావటం వలన,యీ పూట మనతో గడపమని ఆయన్ని ఆహ్వానించాను. అమెరికాలో హైటెక్ వాతావరణం, అక్కడి ఉద్యోగావకాశాలు, ఇలాటివి మీతో మాట్లాడితే, మీ అందరికీ ఉపయోగపడుతుందని నా ఆశ. మిమ్మల్నందర్నీ ఆయనలా, అమెరికా వెళ్ళమనటం లేదు నేను. ఆయన అనుభవంలోని మంచిని గ్రహించి, వృద్ధిలోకి వస్తారని నా నమ్మకం ...... ఇప్పుడు ..... డాక్టర్ పార్థసారథి"

సారథి లేచి మైకు దగ్గరకు వచ్చి గొంతు సవరించుకున్నాడు.

"ఈ రోజున నేనిక్కడకు ఉపన్యాసం యివ్వటానికి రాలేదు. కొన్ని టాపిక్స్ తీసుకుని, మీరూ నేనూ మాట్లాడుకుందాం. పరస్పర సంభాషణలతో ఈ కార్యక్రమం నడపాలని నా వాంఛ. మనకు రెండు గంటల టైము ఇచ్చారు ప్రిన్సిపాల్‌గారు. దాంట్లో మొదటి అరవై నిముషాలు మనం, మీకు కావలసిన విషయాలు, తెలుసుకోదగిన సాంకేతిక వివరాలు మాట్లాడుకుందాం. తర్వాత అరవై నిముషాలు, మనందరకీ అవసరమైన కొన్ని విషయాలు వున్నాయి. అవి మాట్లాడుకుందాం - మీకు యిష్టమేనా?" అడిగాడు సారథి.

ఒకేసారి -- కొందరు "యిష్టమే" అన్నారు -- కొందరు "ఏమిటా అత్యంత అవసరమైన విషయాలు?" అన్నారు, "బోరు కొట్టకుండా వుంటేచాలు ఏదయితేనేం" అన్నారు కొందరు.

సారథి "ఐ హియర్ యు ఆల్ -- మీరు అందరూ ఒకేసారి మాట్లాడే బదులు, చేతులు పైకెత్తితే, నేను ఒక్కొక్కళ్లనీ అడుగుతాను మీ ప్రశ్న ఏమిటని -- అలా అయితే అందరూ వినటానికి అవకాశం వుంటుంది!" అన్నాడు.

అందరూ అంగీకరించారు ఆ పద్ధతికి.

"సరే మీరు అడిగిన దానికి సమాధానాలు -- 'ఏమిటా అత్యవసరమైన విషయాలు?

అన్నారు. ఇంకొక గంట ఆగండి - చెబుతాను. బోరు కొట్టకుండా వుంటే చాలన్నారు. ఎప్పుడు బోరు కొడితే అప్పుడు, గుట్టుచప్పుడు కాకుండా, బయటకు వెళ్ళి, గుండెల నిండా చల్లటిగాలి పీల్చుకుని - ఇళ్లకు వెళ్ళిపోవచ్చు. నేనేమీ అనుకోను. అయినా అది మనందరి భవిష్యత్తుకి సంబంధించిన విషయం కనక - బోరు కొడుతుందని నేను అనుకోను ...'' అన్నాడు సాలోచనగా.

అమెరికాలో ఏయే రంగాలు, హైటెక్‌లో డిమాండ్‌లో వున్నాయో, ఏ సబ్జక్టులలో ఎలా రీసెర్చి జరుగుతున్నదో చెప్పాడు సారధి. కమ్యూనికేషన్సూ, నెట్‌వర్కింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, హార్డ్‌వేర్ డిజైన్, - ముఖ్యంగా ఇంటెగ్రేటెడ్ చిప్ డిజైన్ గురించి చాల విషయాలు మాట్లాడుకున్నారు. త్వరలో ఇంజనీరింగ్ పూర్తిచేయబోతున్న విద్యార్థులు కనుక, సంభాషణలన్నీ చాల ఉత్సాహంగా నడిచాయి. ఎంఐఎస్, లాన్ విడియో కమ్యూనికేషన్సూ దగ్గరనించీ, మాన్యుఫాక్చరింగ్ టెక్నిక్సూ, మార్కెటింగ్ దాకా, చాల చాల విషయాల మీద మాట్లాడుకున్నారు. అరవై నిమిషాలు చకచకా గడిచిపోయాయి. సారథి మధ్యమధ్య టైము చూస్తూ, సరిగ్గా గంట కాగానే ఆపేశాడు.

విద్యార్థుల్ని ఉద్దేశిస్తూ - ''ఇంకొక రెండు నిమిషాల్లో, మన మీటింగ్‌లోని సెకెండ్ హాఫ్ మొదలుపెడదాం--'' అన్నాడు. ప్రిన్సిపాల్ గారి వేపు చూసి, స్నేహపూర్వకంగా నవ్వాడు.

''ఇందాక - మనందరికీ అత్యంత అవసరమైన విషయాలు మాట్లాడుకుందాం అన్నాను. ఇప్పుడు ఆ విషయాలు మాట్లాడుకుందాం--'' నుదుటి మీద చేయి పెట్టుకుని ఒక్క నిమిషం ఆలోచనలో పడ్డాడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు -

''మీకొక చిన్న కథ చెబుతాను. నాకు అప్పుడు ఎనిమిది సంవత్సరాల వయస్సు. స్కూలు నించి రాగానే, విపరీతమైన తలనొప్పిగా వుండి అలాగే మంచం మీద పడిపోయాను. ఒళ్ళు తెలియలేదు. కళ్ళు తెరిచే సరికి హాస్పిటల్‌లో వున్నాను. ముఖం మీద ఆక్సిజన్ మాస్క్, చేతికి ఐవి ట్యూబులూ, ప్రక్కనే మంచం మీద కళ్ళ నీళ్లతో మా అమ్మ. ఎదురుగా, ఆతృతగా చూస్తున్న మా నాన్న. బ్లడ్‌ప్రెషర్ చూస్తున్న నర్సు -అందరిలోనూ, ఆదుర్దా, ఆవేదనతోపాటు నేను స్పృహలోకి వచ్చినందుకు సంతోషం. చివరకు తెలిసిందేమంటే, నా ఇంటెస్టైంట్స్ దగ్గర బ్లీడింగ్. అన్ని పరీక్షలూ చేసి నిర్ధారించింది, నాకు కాన్సర్ వుందని. కాన్సర్ అండే రాచపుండు. అంటే రాజులకు రావలసినది. మరి ఈ మధ్యతరగతి మందభాగ్యుడికి ఎందుకు వచ్చిందో, ఎలా వచ్చిందో ఎవరికీ అర్థం కాలేదు. బొంబాయిలోని జాస్‌లోక్ హాస్పిటల్‌కి తీసుకువెళ్లండి, అక్కడా తగ్గకపోతే విదేశాల్లో వైద్యం చేయించండి. అది కుదరకపోతే దేవుణ్ని నమ్ముకుని, ఆయనకో కొబ్బరి కాయ కొట్టండి. ఆ దేవుడి మీద నమ్మకం లేకపోతే, మీ అదృష్టం మీద ఆధారపడండి - అని చెప్పారు డాక్టర్లు. మా అమ్మా నాన్నల బాధ వర్ణనాతీతం. ఒక్కగానొక్క కొడుకుని, చస్తుంటే చూస్తూ వూరుకోలేరు. అలా అని వైద్యం చేయించే తాహతు ఏ మాత్రం లేదు. ఏ పూటకాపూట మధ్యతరగతి ఆర్థిక మద్యం మందహాసం చేస్తుంటే -- రేపెలాగా గడపడం అనే జీవితాలు. అందరిచేత చాల

తెలివైన వాడిగా కీర్తించబడుతూ, బంగారపు భవిష్యత్తుకి వెళ్ళే అవకాశాలు వున్నా, వెళ్లే దారి దగ్గర "డెడ్ ఎండ్" అనే బోర్డు అడ్డం వచ్చింది మరి! ఆ సమయంలో అలాటి కష్ట సమయంలో మీరు అతిగా ప్రేమించే మీ కొడుకుకి అలా జరిగిందనుకోండి - మీరేం చేస్తారు?" అడిగాడు సారథి.

అయిదుగురు చేతులు పైకెత్తారు. సారథి నాలుగవ వరసలో కూర్చున్న అతన్ని అడిగాడు.

"తలతాకట్టు పెట్టయినా, ఎలాగోలా డబ్బు తెచ్చి, వైద్యం చేయిస్తాను. అంత తెలివైన కుర్రవాడూ, ఎంతో భవిష్యతు కలవాడూ, అలా కళ్ళ ముందే చచ్చిపోవటం - ఎవరూ చూస్తూ వూరుకోరు!"

ఇంకో ముగ్గురు కూడా అలాటి భావమే వ్యక్తపరిచారు. మధ్యవరసలో కూర్చున్న పొడుగతను మాత్రం - "నేను అలా చేయను. నా తలకు మించిన పని అయితే, నేనెలా చేయగలను? -" అన్నాడు.

అతని ప్రక్కనే కూర్చున్న అతను అన్నాడు. "అవును - సూర్యం చెప్పింది కరెక్ట్. వాడి వల్ల కానప్పుడు ..... వాడేం చేయగలడు? దేవుడికి దణ్ణం పెట్టి కూర్చోవటం తప్ప" అన్నాడు.

"నీ పేరు?" అడిగాడు సారథి.

"చంద్రం!"

"అంటే మీరిద్దరూ సూర్యచంద్రుల్లాంటి వాళ్ళన్నమాట. ఈ విశ్వం యింత అందంగా వుండటానికి కారణం మీరిద్దరే. అలాటిది మీరిలా డీలా పడటం నాకు నచ్చలేదు. సూర్యం - నీ జీవితంలో అత్యంత ప్రీతిపాత్రులెవరు?"

"ఉంది - మా అమ్మ. ఆవిడ నా కోసం తన జీవితంలో చాలా కష్టపడింది. మా నాన్న గారు నా చిన్నతనంలో పోవటం వలన, తనే తన సుఖాలు త్యాగం చేసి, నన్నింతవాడిని చేసింది!"

"చంద్రం .... నీకు?" అడిగాడు సారథి.

"ఉంది. నా చెల్లి - నాకూ ఉషకీ పదహారేళ్లు తేడా వుంది. షి యీజ్ ది డార్లింగ్ ఆఫ్ ది హవుస్. ఉష అంటే మా అందరికీ ప్రాణం!"

"ఆ రోజు నాకు వచ్చిన పరిస్థితే సూర్యం వాళ్ళ అమ్మగారికీ, చంద్రం చెల్లెలు ఉషకీ వచ్చిందనుకోండి - ఏం చేసేవారు?

సూర్యం కొంచెం కోపంగా అన్నాడు - "వాళ్ళు చాల ఆరోగ్యంగా వున్నారు. అలాటి రోగాలు వాళ్లకు రావు!"

సారథి అన్నాడు - "రాలేదని నాకూ తెలుసు - రాకూడదని కూడా నేను మనసారా ఆశిస్తున్నాను - ఎ వెరీ హైపోథిటికల్ కేస్ --- వస్తే ఏం చేస్తారు?"

చంద్రం కొంచెం ఆవేశంగా అన్నాడు -- "ఎలాగోలా డబ్బు సంపాదిస్తాను - ఎక్కడా వుద్యోగం దొరక్కపోతే - రిక్షా తొక్కుతాను- అడుక్కుతింటాను - ఎవరి కాళ్ళన్నా పట్టుకుని,

జీవితమంతా ఊడిగం చేస్తాను. ఐ లవ్ ఉష. ఐ కాంట్ లెట్ హర్ డై!''

సారథిచ చంద్రం దగ్గరకు వచ్చి, అతని భుజం మీద చేయి వేశాడు. సుతారాంగా నొక్కాడు. సూర్యం వైపు తిరిగి - ''సూర్యం - నువ్వు చెప్పు!'' అన్నాడు.

''నా మనసులో విషయం కూడా, చంద్రం చెప్పిందే - ఇన్నాళ్లు కష్టపడి నన్ను పెంచి, నా భవిష్యత్తు మీద ఎంతో నమ్మకం పెట్టుకున్న ఆవిడను, ఎలా వదిలేస్తాను? షి యీజ్ మై మదర్, ఐ విల్ సాక్రిఫైస్ ఎనీ థింగ్ టు సీ హర్ ఎలైవ్'' ధృడంగా అన్నాడు సూర్యం.

సారథి, సూర్యం చేతిని తన చేతుల్లోకి తీసుకుని, స్నేహపూర్వకంగా నొక్కాడు. ఒక్క నిమిషం హాలంగా నిశ్శబ్దంగా వుంది. సారథి ఆ కథ ఎందుకు చెప్పాడో, అక్కడి నించి ఎక్కడికి తీసుకువెడుతున్నాడో అర్థం కాలేదు.

ఒక గుక్కెడు నీళ్లు త్రాగి, మళ్లీ మొదలుపెట్టాడు.

''నేనీరోజు ఇలా వున్నానంటే కారణం, ఆ రోజు నా తల్లిదండ్రులు ఒక పూట తినటం మానేసి, వున్న ఇల్లు తాకట్టు పెట్టి, నాకు వైద్యం చేయించటమే! వాళ్ళు పడ్డ కష్టాలకి, ఫలితం ఈ రోజు నేను అనుభవిస్తున్నాను!''

ఒక క్షణం ఆగి అన్నాడు -''మూడేళ్ల క్రితం అనుకుంటాను - నేను రాత్రి పదకొండు గంటలకు, ఆఫీసు నించి ఆలస్యంగా ఇంటికి వెడుతున్నాను. మా యింటికి నాలుగిళ్ల అవతల గడ్డికి నిప్పు అంటుకుంది. ఎండలకు గడ్డి, డ్రైగా వుండటం వలన, మంటలు వ్యాపిస్తున్నాయి. బయట ఎవరూ ఆ మంటల్ని చూడలేదు. వెంటనే ఫైర్ సర్వీస్‌కి ఫోన్ చేశాను. అంతేకాదు చుట్టుపక్కల నలుగురిళ్ల వాళ్లనీ లేపాను. చకచకా అందరం లాన్ స్ప్రింక్లర్ సిస్టమ్ ఆన్ చేశాము. వాటర్ హోస్‌లతో మంటలను ఆర్పేశాం. ఫైర్ యింజన్ వాళ్ళు వచ్చేసరికే అన్నీ కంట్రోల్‌లోకి వచ్చాయి. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే -- నేను ఏదో గొప్ప పని చేశానని కాదు - తప్పు పని చేయలేదు అని. నా ధర్మం నేను చేశాను అని. నేను నాకెందుకులే అని ఊరుకుంటే మంటలు వ్యాపించేవి. ఇల్లు అంటుకునేది. ప్రక్క ఇళ్లు అంటుకునేవి. అప్పుడు మంటలను ఆర్పటం చాల కష్టం అయేది. ఒకపావు గంటలో మా యిల్లు కూడా తగలబడేది -- మట్టిలో కలిసిపోయేది!''

వెనక కూర్చున్న అతను అడిగాడు - ''మీరు ఏవో ముఖ్యమైన విషయాలు చెబుతారనుకుంటే - రోగాల కథలూ, త్యాగాల కథలూ, ఇల్లు తగలబడే కథలూ చెబుతున్నారేమిటి ?''

సారథి మందహాసం చేశాడు - ''వస్తున్నాను. కొంచెం ఓపిక పట్టండి. ఓ రెండు నిమిషాలు ప్రపంచ చరిత్ర మాట్లాడుకుందాం - ముఖ్యంగా గత యాభై ఏళ్లల్లో జరిగినవి - హిట్లర్‌కి ప్రపంచం అంతా తన చేతిలో పెట్టుకుని, రారాజునవుదామని కోరిక పుట్టి, మారణహోమం చేశాడు. సోవియట్ యూనియన్‌లో కమ్యూనిజం కుళ్లిపోయి, ప్రజలు హీనావస్థలో వుంటే - తను ఒక్కడే పట్టుదలతో పనిచేసి, అక్కడ ప్రజలకు, ప్రజాస్వామ్యం తీసుకువచ్చాడు గోర్బచేవ్. అమెరికాలో తెల్లవాళ్లు, నల్లవాళ్లని జంతువుల కన్నా హీనంగా

చూస్తుంటే భరించలేకపోయాడు మార్టిన్ లూథర్ కింగ్. తన ప్రాణాలను సైతం త్యాగం చేసి, నల్లవాళ్ల సంకెళ్లను పగలకొట్టాడు. గోపాలకృష్ణ గోఖలే బ్రిటిష్ వాళ్ల దోపిడీని అరికట్టడానికి నాయకుడి కోసం వెతికి, సౌత్ ఆఫ్రికాలో తెల్లవాళ్ల మీద ఒంటరిగా పోరాడుతున్న గాంధీని యిండియాకి రప్పించాడు. తర్వాత మహాత్మాగాంధీ నాయకత్వంలో భారతదేశం స్వరాజ్యం సంపాదించింది. గాంధీ అడుగు జాడల్లో నడిచి, నల్లవాళ్లపై తెల్లవాళ్ల దురంతాలను అరికట్టాడు మాండేలా. అమెరికాలో కన్సూమర్ ఎవేర్‌నెస్ కోసం నడుముకట్టి, విజయం సాధించాడు రాల్ఫ్ నాడార్ ....." ఒక్క నిమిషం ఆగి మళ్లీ అన్నాడు సారథి.

"అమెరికాలో క్రైస్లర్ అనే కారు కంపెనీ వుంది. ఆ కంపెనీ దివాళా తీసే పరిస్థితుల్లో వున్నప్పుడు, లీ అయోకోకా అనే ఆయన ఆ కంపెనీకి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వచ్చాడు. ఆ కంపెనీకి చాలా లాభాలు సంపాదించి పెట్టాడు. మానేజ్‌మెంటులో ఆయన్ని గొప్పవాడుగా గౌరవిస్తారు. ఆయన ఒకసారి అన్నాడు - ఏదన్నా మంచి పని చేయాలంటే - నువ్వు నాయకత్వం వహించు. నీకు నాయకత్వం వహించే వుద్దేశం, లక్షణాలు లేకపోతే, నాయకత్వం వహించడానికి అర్హత వున్నవాడికి, పూర్తి సహకారం యిచ్చి వెనక నిలబడు. ఆ రెండూ చేయలేకపోతే, నోరు మూసుకుని ప్రక్కకు తొలుగు. కనీసం పనిచేసేవాడి కాళ్లకు అడ్డం రాకు - ఇందాక చెప్పిన పేర్లలో నాయకులు వున్నారు - నాయకత్వాన్ని సమర్థిస్తూ, సహకారం అందించిన వాళ్ళూ వున్నారు!"

సూర్యం అన్నాడు - "మీరు హరికథ చెబుతున్నట్లుగా వుంది - అన్నీ పిట్టకథలు - ఒకదానికొక్కటి సంబంధం లేనివి!"

చంద్రం అన్నాడు - "మా సమయం వృథా చేస్తున్నారు!" అని.

"అలా అని నేను అనుకోను. మనం ఈ విషయాలకి ఒక గంట కేటాయించాము. దాన్లో యిప్పుడు నలభై నిమిషాలు అయింది. ఇంకో ఇరవై నిమిషాల్లో మనం మీటింగ్ పూర్తి చేద్దాం - " స్టేజీ దిగివచ్చి, ముందు వరసలోని కుర్చీల దగ్గర నుంచున్నాడు సారథి.

"నేను చెప్పేది కొంచెం జాగ్రత్తగా వినండి - మీరందరూ తెలివిగలవాళ్లు. నే చెప్పేది అర్థం చేసుకోవటానికి మీకు ఎక్కువ సేపు పట్టదు. అందుకే ఈ విషయాలు మీతో, చాలా ఆశతో, మాట్లాడుతున్నాను"-- ఒక క్షణం ఆగి అన్నాడు.

"మన దేశాన్ని గత అయిదారు వందల సంవత్సరాల్లోనూ, మూడు రకాల బందిపోట్లు దోచుకున్నారు - మొగలాయీలు వచ్చి మన వనరులను నాశనం చేసి, దేశాన్ని పూర్తిగా కొల్లగొట్టి గానీ, బయటకు పోలేదు. మన దేశ సంపదనంతా దోచుకున్నారు. తర్వాత రెండవ రకం బందిపోట్లు బ్రిటీష్ వాళ్లు, వ్యాపారం కోసం అని వచ్చి, రెండు వందల సంవత్సరాలు మన నెత్తిమీద కూర్చుని, మన దేశాన్ని సర్వనాశనం చేశారు. బానిసత్వాన్ని నరనరాల నింపారు. వీళ్లకు, కొందరు రాజులు, జమీందారులు తొత్తుల్తుగా మారి, ఆ దోపిడిలో వారికి సహాయం చేశారు. ఇక మూడో రకం వాళ్లు మన రాజకీయ నాయకులు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నించీ, ఇప్పటిదాకా వీళ్ల దోపిడికి అంతులేదు. అటు కోట్లకు కోట్లు డబ్బు దోచుకోవడటమే కాక, కుల, మత, ప్రాంతీయ, భాషా రాజకీయాలతో దేశాన్ని ఛిన్నాభిన్నం

చేస్తున్నారు. వీళ్ల తొత్తులు లంచాలు తినే ప్రభుత్వాధికారులు, ఉద్యోగులు, గూండాలు. గూండాయిజంలో గూండాలను మించిన పోలీసులు. ఈ దోపిడీదార్లు, మొగలాయీలలాగా, బ్రిటిష్ వాళ్లలాగా, మన దేశం వదలి బయటకుపోరు. ఎందుకంటే, వీళ్లు ఈ దేశం వాళ్లే కనుక. ఈ అన్ని రకాల బందిపోట్లలోకీ, అతి భయంకరమైన వాళ్లు, దేశానికి శత్రువులూ, ఈ మూడోరకం వాళ్లు ......."

"మీరు నక్సలైటులా....." అరిచాడు వెనకనించి ఒకతను.

నవ్వాడు సారది :- "ఈ ప్రశ్న వస్తుందని నాకు తెలుసు. దానికి జవాబు ఒక్కటే. నేను నక్సలైట్‌ని కాదు. కమ్యూనిస్టుని అసలే కాదు. ప్రపంచంలో కమ్యూనిజం చచ్చిపోయింది. రష్యా, చైనా, పోలెండు, తూర్పు జర్మనీ లాటి కమ్యూనిస్టు దేశాల్లోనే, కమ్యూనిజం చచ్చిపోయినప్పుడు మనకెందుకా దరిద్రం. ఇందాక మనం కమ్యూనికేషన్స్, నెట్‌వర్క్ వర్కింగ్ గురించి మాట్లాడుకున్నాం. ఇప్పుడు అది ఆచరణలో పెడదాం. ఇందాకటి నించీ మీకు నేను చాల ఇన్‌ఫర్మేషన్ యిచ్చాను. యిప్పుడు ఒక పద్ధతితో ప్రాసెస్ చేద్దాం. ఎక్కడ తేలుతామో చూద్దాం - సూర్యం! ఒకసారి యిలా రా ....."

సూర్యం లేచి వచ్చాడు. సారధి ప్రక్కనే నుంచున్నాడు.

"ఒక్కసారి - ఇందాక అనుకున్నవన్నీ - రీవైండ్ చేసి, వాటిని ఎనలైజ్ చేద్దాం - ముందు మనం నా చిన్నప్పటి అనారోగ్యం గురించి మాట్లాడుకుని, మీ అమ్మగారి గురించి, చంద్రం చెల్లి గురించీ మాట్లాడుకున్నాం. అన్ని కష్టాలకు ఓర్చి, ఎన్నో త్యాగాలు చేసి నిన్నింత వాడిని చేసిన మీ అమ్మ కోసం నువ్వేమైనా చేస్తానన్నావ్ సూర్యం. అలాగే బంగారపు భవిష్యత్తు వున్న తన చెల్లెలు ఉష కోసం ప్రాణాలనయినా అర్పిస్తానంటున్నాడు చంద్రం. సూర్యం మీ అమ్మ ఎవరో తెలుసా. మన దేశం. భారత దేశం. ఎంతోమంది త్యాగాలు చేసి, ప్రాణాలు కోల్పోయి మనకందించారీ స్వతంత్ర దేశాన్ని. ఆ దేశాన్ని కాపాడటానికి, ఏమైనా చేస్తానన్నాడు సూర్యం. ఉష ఎవరో కాదు. మనందరి పిల్లలూను. వాళ్ల భవిష్యత్తు, ఈ దేశ భవిష్యత్తుతో ముడిపడి వుంది. ప్రాణాలర్పించి అయినా కాపాడుతానంటున్నాడు చంద్రం.'

చంద్రం కూడా లేచి వచ్చి, సారధికి రెండవ ప్రక్కన నుంచున్నాడు.

"మా యింటి దగ్గర మంటలను ఆర్పి, మా పేటలో అన్ని ఇళ్లనూ, తగలబడకుండా చేశాము అన్నాము. అది నిజంగా జరిగిన కథ. నేను ఇందాక చెప్పినట్లుగా, నేనేమీ గొప్పపని చేయలేదు. నేను చల్లిన నీళ్లు మొత్తం మంటలను ఆర్పలేదు. నేను చేసిన దల్లా ప్రక్కనేవున్న అందర్నీ కూడగట్టుకుని, మంటలు వ్యాపించేలోగా ఆర్పివేయటమే. నేను నా కెందుకని ఊరుకుని వుంటే ముందు ఆ ఇల్లు తగలబడేది. తర్వాత ప్రక్క యిల్లు..... ఆ పక్క యిల్లు..... ఒక్కపావు గంటలో నా ఇల్లు. నా జీవితం అంతా ధారపోసి కట్టుకున్న నీ ఇల్లు తగలబడుతుంటే చూస్తూ వూరుకోవడానికి, నేనేమీ చేతగాని వాణ్ణి కాదు. నా శాయశక్తులా ప్రయత్నించాను. నా ఇల్లేకాక, ఆ పేట అంతా కూడా తగలబడకుండా ఆపగలిగాము"

కుడిప్రక్క కుర్చీలో కూర్చున్న అతను అన్నాడు - "నేనూ చేశాను అలాటి పనులు - ఒకటి రెండు సార్లు --- అదేమీ గొప్పకాదే!" అతని ప్రక్కనే వున్న మిత్రులు పెద్దగా నవ్వారు.

సారథి కూడా నవ్వాడు - "నేను చేసింది గొప్పపని కాదు అనే నేను యిందాకే చెప్పాను. కానీ ఆ పని చేయకపోవటం, మన తప్పు అని చెబుతున్నాను. మనందరం అలాటి పనులు రోజు చేయటం అవసరం. మనకెందుకులే అని ఊరుకుంటే, మన బ్రతుకులకే ప్రమాదం. ఎవరో ఎక్కడి నించో వచ్చి మన కష్టాలు తీరుస్తారు అనుకోవడం శుద్ధ అవివేకం. మీకు మహాత్మాగాంధీ నించి, గార్బచేవ్ దాకా కొన్ని ఉదాహరణలు యిచ్చాను. చరిత్ర ఏం చెబుతున్నదో చూశారా - చెడు కానీ, మంచి కానీ, ఒక్క మనిషి దగ్గరే మొదలవుతున్నది. ఈ పనులు చేసిన వాళ్లు ఎవరూ, అవి ప్రారంభించేటప్పుడు గొప్పవాళ్లు కాదు - నాలాగా, మీలాగా సామాన్యులే. వాళ్లు చేసినదల్లా ఒక్కటే - నా కేందుకులే, నా ఒక్కడి వల్లా అవుతుందా అని ఊరుకోక, నా బాధ్యత నన్ను చేయనీ.... అని ముందుకు వచ్చారు. పట్టుదలతో నిలిచారు. అప్పుడు ప్రసిద్ధులయారు!"

సూర్యం అన్నాడు - "అవును - మీరు చెప్పింది నిజం - ఎంతోమంది ప్రాణాలను త్యాగాలు చేసి, మనకు యిచ్చిన దేశాన్ని, దుర్మార్గులు ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ఇంతకుముందు సగం మంది నాయకులలోనైనా దేశాభిమానం, నీతీ, నిజాయితీ, వుండేవి. ఇప్పుడు అలాటి వాళ్లను, వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. రాష్ట్రంలో కుల రాజకీయాలతోనూ, కేంద్రంలో మత రాజకీయాలతోనూ, ప్రజలను విభజించి, డబ్బులు చేసుకుని, అధికార మదంతో స్వంత తల్లినే అమ్ముకునే ఈ నీచులు అనుభవించే దేమిటో అర్థం కాదు -"

చంద్రం అన్నాడు "ఎక్కడ చూసినా లంచాలు - గూండాయిజం - వయలెన్సు - నిజాయితీగా బ్రతికేవాళ్లకు - ఏ మాత్రం భద్రత లేదు!"

"దానికి కారణం - అవినీతి ప్రభుత్వోద్యోగులూ, రాజకీయ నాయకులూ, అయినా, వాళ్లు అలా బరితెగించటానికి కారణం మనమే - ఈ దేశం నీకేం చేసింది అని కాదు - ఈ దేశానికి నువ్వేం చేశావ్ అని అలోచించు అన్నాడు కెన్నెడీ. కనుక వాళ్లు అలా తయారయితే, మనం ఏం చేస్తున్నాం? వాళ్లకు లంచాలు యిస్తున్నాం - ఓట్లు వేస్తున్నాం. అవన్నీ మరచిపోయి, సిగ్గులేకుండా - దేశం పాడయిపోతున్నదండీ అని ప్రతి కిళ్లీ కొట్టు దగ్గరా నుంచుని సొళ్లు కబుర్లు చెప్పుకుంటున్నాం --"

"అయితే - ఏం చేయాలో చెప్పండి..." అడిగాడు ముందు వరసలో కూర్చున్న అతను.

సారథి - "అదేమిటో మనందరం కలిసి ఆలోచిద్దాం. మిగతా చోట్ల విజవంతం అయిన పద్ధతులనే అవలంబించటం, "బెంచ్ మార్కింగ్" అంటారు. ఆ విషయంలో కొన్ని సలహాలు యివ్వగలను. అమెరికాలో టీవీ, రేడియో, న్యూస్‌పేపర్లూ, కుతంత్ర రాజకీయ నాయకులకూ, అవినీతిపరులకూ, బద్ధవిరోధులు. రాజకీయ నాయకులూ లంచాలు తిన్నట్లు ఏ మాత్రం అనుమానం వున్నా, వెంటనే టీవీలో చూపడం, ఇంటర్వ్యూలు

ఇన్వెస్టిగేషన్లూ .... టీవీ స్టేషన్లు ఒక దానిమీద ఒకటి పోటీపడి - పూర్తి వివరాలు బయటకు లాగి, ప్రజల ముందు పెడతారు. చెప్పుకోదగ్గవి, రేడియోలో టాక్ షోలు. సిటీ మేయర్నీ, స్టేట్ గవర్నర్నీ, టాక్షో హోస్ట్ ఆహ్వానించి, ప్రజల చేత ఫోన్లో ప్రశ్నలు వేయించి, జవాబులు చెప్పిస్తారు. వాళ్ళు చేస్తున్న పనులు, ఎందుకు చేస్తున్నదీ, ప్రజలు చేయమన్నవి ఎందుకు చేయటంలేదో, రేడియోలో ప్రత్యక్షంగా నిలదీసి అడుగుతారు. సెనేట్లోనూ, కాంగ్రెస్లోనూ, (లోక్సభ, రాజ్యసభ లాంటివి) ఏ విషయం మీద ఎవరు ఎలా ఓటు వేశారో పబ్లిసిటీ యిస్తారు. అలాగే న్యూస్పేపర్లు కూడాను. మన దేశంలో దురదృష్టవశాత్తూ, రేడియోలు, టీవీ రాజకీయ నాయకుల చేతుల్లో వున్నాయి. కనుక మిగిలినవి పత్రికలు. పత్రికలలో అవినీతిని బయట పెట్టిండి. షాపులలో కల్తీ దగ్గర నించి, నాయకుల చరిత్ర అంతా బయటపెట్టండి. మీ వూళ్లో ఎలక్ట్రిసిటీ బోర్డు, పిడబ్ల్యుడి, రెవిన్యూ, టెలిఫోన్, పోలీసు, రిజిస్ట్రార్, ట్రాన్స్పోర్టు డిపార్టుమెంటుల్లో, చీఫ్ ఇంజనీరింగ్ దగ్గర నించి, క్లర్క్ల దాకా, వాళ్ల లంచాల కథలు, పేరు పేరునా వివరాలు సేకరించి, పత్రికల్లో ఫోటోలతో సహా వేయండి. కొన్ని పత్రికల వాళ్లు కూడా, ఆ అవినీతిలో భాగస్వాములే అయితే, మీరే అలాటి పత్రికలు ప్రారంభించండి. అది ఒక పెద్ద గ్రూప్ ఏక్టివిటీగా చేస్తే, వ్యక్తిపరంగా కష్టనష్టాలు రావు. ఇది ఒక శాంతియుత ఉద్యమంగా రావాలి. జిల్లాల వారీగా, రాష్ట్రాల వారీగా... ఇదేదో అసంభవమైనదికాదు. రాల్ఫ్ నాడార్ ప్రారంభించిన కన్స్యూమర్ మూవ్మెంటు అలా ప్రారంభించినదే. ఇప్పుడు దేశవ్యాప్తంగా నడుస్తున్నది. బస్సులు, రైళ్లు తగలపెట్టడం, సమ్మెలు చేయటం వల్ల, దేశం వెనక్కు పోతుంది కానీ, ముందుకు వెళ్లదు. శాంతియుతంగా చాల పనులు చేయవచ్చు. మన రోడ్ల నిండా చెత్తా - చెదారం . ఏ రోడ్డు వారు , ఆ రోడ్డుని శుభ్రం చేసుకుని, చెత్త ఒక్కపక్క కుప్పగా పోసి, మునిసిపాలిటీ వారిని అది తీసుకుపొమ్మని బలవంతం చేయవచ్చు. కమ్యూనిటీ టీమ్స్ ముందుకు రావాలి. అలాగే క్రైం ప్రివెన్షన్. ప్రతిపేటలోనూ, రోడ్డులోనూ, వాచ్టీమ్లు ముందుకువచ్చి, వంతులు వేసుకుని దొంగతనాలను అరికట్టవచ్చు. ఇవన్నీ కథలు కాదు. అమెరికాలో ఇవన్నీ ప్రతిరోజూ, ప్రతిపేటలోనూ, ప్రతి ఊళ్ళోనూ జరుగుతున్నవే - ప్రభుత్వం మీద ఆధారపడకుండా, ఇలా చాల చేయవచ్చు. నిజాయితీ వున్న ప్రభుత్వానికి ఇది ఒక విధంగా లాభం కూడానూ. మీ ఇంటి ముందు శుభ్రంగా వుంచితే, మీ ఊరే కాదు దేశం అంతా శుభ్రంగా వుంటుంది. ఓటుకి ఎంత బలం వుందో నిరూపించండి. ఒక పార్టీ మంత్రి వెధవ అని, ఇంకొక పార్టీకి సంబంధించిన పరమ సన్నాసిని ఎన్నుకోకండి. ఇద్దరినీ వెళ్లగొట్టి, ఒక దేశాభిమానిని, నిజాయితీపరుడ్ని ఎన్నుకోండి. పార్టీలు కాదు మనకు కావలసింది ప్రజలు - మన దేశాన్ని మనం రక్షించుకుందాం - కానీ చివరగా ఒక్కమాట - ఎక్కడి నించో ఎవరో వచ్చి, మనల్ని ఉద్ధరించరు - మన బ్రతుకులు, మన ఇల్లు, మన ఊరు, మన దేశం - మనమే దిద్దుకోవాలి. ఒక్కమనిషి చాలు, ఒక్క మంచి పని ప్రారంభించటానికి - అది మీలో ఒక్కొక్కరు ఎందుకు కాకూడదు?" ముగించాడు సారధి.

అవును ! ఆ ఒక్క మనిషీ - నేనూ, మీరూ, మనలో ఒక్కొక్కళ్లు ఎవరయినా కావచ్చు!